సాగర్ శిల్పం

కదిలే కథ మధ్య
కదలకుండా నిలిచేదానా !
కదలని మనసుల్ని కూడా
కదిలించేదానా !
పొలం గట్టున పొరపాటున
మొలిచినట్టున్న గులాబీ మొక్కా !
ఎంత వయారంగా విరబూసావు నువ్వు !
అయినా, ఈ సన్యసించిన వాడి కథలో
నువ్వెలా ఇమడగలిగేవు ?

రాళ్ళమధ్య రెక్కలార్చిన రాజహంసా !
నువ్వు విడదీసేది ఘట్టాల్ని కాదు;
కథ నుంచి దాని అసలు సారాన్నే
అవలీలగా వేరు చేస్తున్నావు.

అడవికి బయల్దేరిన గౌతముడు
నిన్ను చూడగానే ఎందుకు ఆగిపోలేదో !
నీకు శోకం లేదు, మృత్యువు లేదు,
ముసలితనం లేదు;
శతాబ్దాల తరబడి చెరగని రూపంతో
మెరిసే శిల్పమా !
ఏ సిద్ధార్థుడూ నిన్ను ఎందుకు గుర్తించలేదు ?

వేదన ప్రక్క నువ్వు; వైరాగ్యం ప్రక్క నువ్వు;
వెలిగే జ్ఞానం ప్రక్క నువ్వు
– చిరునవ్వువై, మండే కోరికవై,
మహత్తరమైన అందానివై కనిపిస్తావు
జీవితంలో వైరుధ్యాలన్నిటికి
నువ్వే సరైన భాష్యంగా అనిపిస్తావు.

నువ్వు మా జీవితపు విలువల పునాదుల్ని
తుదకంటా కదిలించే ప్రశ్నవి.
మేం ప్రదర్శించే నిర్లిప్త వదనాల మీద
అందమైన మచ్చవి.

మార్చి, '84